@netifocusnews @focustv
https://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

COMPLIMENTARY COPY

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: ఎం. తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | బుధవారం, 31 జనవరి 2024 | పేజీలు - 4




## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ప్రమాణానికి బ్రేక్

తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు నిలిపేసిన హైకోర్టు


2లో

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారానికి హైకోర్టులో బ్రేక్ పడింది. యథాతథ స్థితిని కొనసాగించాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీరుల్లా ఖాన్‌లు ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే ఎమ్మెల్సీల నియామకంపై బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో సవాల్ చేశారు. గతంలో తాము వేసిన పిటిషన్‌పై విచారణ తేలే వరకు ఎమ్మెల్సీల నియామకాలు ఆపాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

– నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్

## తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహం ఏర్పాటు

మున్సిపల్ తీర్మానానికి ప్రభుత్వం ఆమోదం



2

ప్రజాయుద్ధనౌక గద్దర్ విగ్రహ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధి తెల్లాపూర్ మున్సిపాలిటీలోని రామచంద్రాపురంలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లభించింది. గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెల్లాపూర్ మున్సిపాలిటీ చేసిన తీర్మాణాన్ని ప్రభుత్వం ఆమోదించింది.

– నేటి ఫోకస్ న్యూస్, సంగారెడ్డి

## ప్రత్యేక హోదాపై కాంగ్రెస్ పోరు

ఢిల్లీలో ధర్నా యోచనలో ఏపిసిసి చీఫ్ షర్మిల



2

## త్వరలోనే సీట్ల సర్దుబాటు

ఉమ్మడి ప్రచారంపైనా నేతల దృష్టి

జనసేన, టిడిపిల మధ్య

కొలిక్కిరానున్న సర్దుబాటు



2

జనసేన, టిడిపిల మధ్య సీట్ల సర్దుబాటు త్వరలోనే సర్దుబాటు కానుందని తెలుస్తోంది. అలాగే రెండు పార్టీల అధినేతలు ఉమ్మడి ప్రచారానికి సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. వచ్చే నెల 4 నుంచి మిగిలిపోయిన పార్లమెంట్ నియోజకవర్గాల్లో రా కదలిరా సభలు పెట్టనున్నారు.

– నేటి ఫోకస్ న్యూస్, అమరావతి



## నేటినుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

ఫిబ్రవరి1న ఆర్థికమంత్రి ఓటాన్ అకౌంట్ బడ్జెట్

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొత్త భవనంలో నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో చివరి బడ్జెట్ సమావేశం మొదలవుతుంది. ఉభయ సభలను ఉద్దేశించి ముర్ము ప్రసంగిస్తారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం నాడు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను లోక్ సభలో ప్రవేశ పెడతారు. ఏప్రిల్- మే నెలలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రతిపాదిస్తారు. ఎన్నికల నేపథ్యంలో విధానపర ప్రకటనలు ఏమి ఉండకపోవచ్చు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కు పార్లమెంట్ ఆమోదం తెలిపితే ఏప్రిల్- జులైకి కావాల్సిన నిధులను ప్రో రేటా ప్రాతిపదికన భారత సంఘటిత నిధి నుంచి తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం 2024-25 ఏడాదికి జూన్‌లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెడతారు. ఈ క్రమంలో కొత్త పథకాలు లేదా విధానాలు ప్రకటించే అవకాశం ఉండకపోవచ్చు. ఆర్థికమంత్రిగా వరసగా ఆరోసారి నిర్మలా సీతారామన్ బడ్జెట్ సమర్పిస్తున్నారు. ఐదు సార్లు పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పించారు. ఈ సారి ఓటాన్ అకౌంట్ బ్జడెట్ ప్రతిపాదిస్తారు. వరసగా ఆరోసారి బ్జడెట్ సమర్పించిన మహిళ నేతగా నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించారు. మాజీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ అత్యధికంగా పది సార్లు బ్జడెట్ ప్రవేశపెట్టారు. ఆ తర్వాత స్థానంలో నిర్మలా సీతారామన్ నిలుస్తారు. అరుణ్ జైట్లీ, పి చిదంబరం, యశ్వంత్ సిన్హా, మన్మోహన్ సింగ్ ఐదు సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ బ్జడెట్ ప్రవేశపెట్టారు. ఇందిరా

మిగతా2లో



## జాతిపితకు సీఎం ఘన నివాళి

ప్రభుత్వ క్యాలెండర్ ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి30:** మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జాతి ఆయనకు గననివాళి అర్పించింది. మంగళవారం లంగర్‌హౌజ్ బాపూ ఘాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి తదితరులు గాంధీఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించారు. మహాత్ముడి సేవలను స్మరించుకున్నారు. పలువురు ప్రముఖులు జాతి పితకు నివాళి అర్పించారు. ఇదిలా వుంటే సచివాలయంలో సిఎం ప్రభుత్వ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సిఎస్ శాంతికుమారి, హోం సెక్రటరీ జితేందర్, అంజన్ కుమార్ ఉన్నారు.

## కేటీఆర్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న రాజకీయాలు

సొంత ఇలాఖాలోనే నేతల తిరుగుబాటు

పార్టీ కట్టుదాటుతున్న కిందిస్థాయి నేతలు

పూర్తిగా దెబ్బతీయాలన్న ప్రయత్నాల్లో కాంగ్రెస్

తాజా రాజకీయ పరిణామాలతో కేటీఆర్ ఉక్కిరి బిక్కిరవుతున్నారని తెలుస్తోంది. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు రాజీనామాల బాట పడుతుండడంతో కేటీఆర్ కలవరం చెందుతున్నారు. పార్టీ నేతలను కాపాడుకోలేక ఆయన తంటాలు పడుతున్నారని చర్చ నడుస్తోంది.

– నేటి ఫోకస్ న్యూస్, కరీంనగర్

వివరాలు 2లో



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ప్రమాణానికి బ్రేక్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి30:** గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారానికి హైకోర్టులో బ్రేక్ పడింది. యథాతథ స్థితిని కొనసాగించాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీరుల్లా ఖాన్‌లు ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే ఎమ్మెల్సీల నియామకంపై బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో సవాల్ చేశారు. గతంలో తాము వేసిన పిటిషన్‌పై విచారణ తేలే వరకు ఎమ్మెల్సీల నియామకాలు ఆపాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణకు రాగా.. యథాతథంగా కొనసాగించాలంటూ న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 8కి హైకోర్టు వాయిదా వేసింది. ఈ మేరకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరామ్, అమీర్ అలీఖాన్‌లను నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై రాష్ట్ర హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం యథాతథ స్థితినే కొనసాగించాలని, తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు కొత్త సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించవద్దని తన ఆదేశాల్లో పేర్కొన్నది. దాంతో హైకోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా ప్రొఫెసర్ కోదండరామ్, అమీర్ అలీఖాన్‌లు ప్రమాణం చేయడానికి వీల్లేకుండా పోయింది. ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అమీర్‌ఖాన్‌లను నియమించడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. దాంతో కోర్టు తాజా ఉత్తర్వులు ఇచ్చింది. కొద్ది నెలల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దాసోజు శ్రవణ్, సత్యనారాయణలను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు నామినేట్ చేసింది. అయితే గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వారి పేర్లను తిరస్కరించారు. అయితే గవర్నర్ తమ నియామకాలకు ఆమోదం తెలుపకపోవడంపై దాసోజు శ్రవణ్, సత్యనారాయణ రాష్ట్ర హైకోర్టుకు వెళ్లారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టికల్ 171 ప్రకారం తమను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసిందని.. దాన్ని తిరస్కరించే హక్కు గవర్నర్ లేదని వారు పేర్కొన్నారు. ఆ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈలోపే కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరామ్, అమీర్ అలీఖాన్‌లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించడం, గవర్నర్ ఆమోదం తెలపడంపై దాసోజు శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టుకు వెళ్లారు.

## తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహం ఏర్పాటు

**నేటి ఫోకస్ న్యూస్, సంగారెడ్డి,జనవరి30:** ప్రజాయుద్ధనౌక గద్దర్ విగ్రహ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధి తెల్లాపూర్ మున్సిపాలిటీలోని రామచంద్రాపురంలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లభించింది. గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెల్లాపూర్ మున్సిపాలిటీ చేసిన తీర్మాణాన్ని ప్రభుత్వం ఆమోదించింది. గద్దర్ విగ్రహం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ప్రజాకవి గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానన్న రేవంత్‌రెడ్డి మాటను ఇచ్చారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెల్లాపూర్ మున్సిపాలిటీ చేసిన తీర్మానాన్ని హెచ్ఎండీఏ ఆమోదించింది. ఈ నేపథ్యంలో విగ్రహ ఏర్పాటు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తూ రేవంత్ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజా యుద్ధ నౌకగా పేరుగడించిన గద్దర్ అనారోగ్యం కారణంగా మరణించిన విషయం తెలిసిందే. ఆయన మరణించిన సమయంలో రాజకీయ పార్టీలు స్పందించి తీరు అప్పట్లో చర్చకు దారి తీశాయి. అయితే టీపీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి మాత్రం గద్దర్ అంతిమయాత్రలో అన్నీ తానై ముందుకు నడిపించారు. గద్దర్ మరణ వార్త తెలిసిన వెంటనే ఆస్పత్రికి చేరుకున్న రేవంత్.. భౌతికకాయాన్ని ఎల్బీస్టేడియంకు తరలించడం దగ్గర నుంచి అంతిమయాత్ర, అంత్యక్రియలు ఇలా అన్నింటిలో ముందుండి నిర్వహించారు. ప్రభుత్వ లాంఛనాలతో గద్దర్ అంత్యక్రియలు జరిగినప్పటికీ.. అక్కడ అన్నీ చూసుకుంది మాత్రం రేవంత్ రెడ్డే. మొత్తానికి గద్దర్‌ను కాంగ్రెస్ తన సొంతమనిషిలా చూసుకుని ఘనంగా వీడ్కోలు పలికింది. కాగా.. గద్దర్ తన కుమారుడు సూర్యను రాజకీయాల్లో తీసుకురావాలని ఎంతగానో ప్రయత్నించారు. అనుకున్నదే తడువుగా ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దలను కలిసి కుమారుడితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొత్త పార్టీ పెట్టాలన్న ఆలోచనను కూడా పక్కన పెట్టి చివరకు వరకు కాంగ్రెస్ పార్టీతో సత్సంబంధాలు కొనసాగించారు. అయితే కుమారుడిని రాజకీయాల్లో ఉన్నంత స్థాయిలో చూడాలన్న కోరిక తీరకుండానే గద్దర్ ప్రాణాలు వదిలారు. అయితే గద్దర్ కోరికను నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చింది. గద్దర్ కుటుంబానికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. కుమారుడికి బదులుగా గద్దర్ కుమార్తె వెన్నెలకు గత ఎన్నికల్లో హైదరాబాద్ కంటోన్మెంట్ టికెట్‌ను కేటాయించింది. అయితే ఆ ఎన్నికల్లో వెన్నెల ఓటమిపాలయ్యారు.

## ప్రత్యేక హోదాపై కాంగ్రెస్ పోరు

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి,జనవరి30:** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు దగ్గర పడుతున్న టైంలో ఇప్పుడు మరోసారి ప్రత్యేక హోదా తెరపైకి వచ్చింది. అధికార ప్రతిపక్షాలు దీన్ని పెద్దగా పెట్టించుకోకపోయినా కాంగ్రెస్ దీన్ని హైలెట్ చేస్తోంది. పదేళ్లుగా ప్రత్యేక హోదా అంశాన్ని బీజేపీతో కుమ్మక్కై అన్ని పార్టీలు పక్కన పెట్టేశాయని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కచ్చితంగా ప్రత్యేక హోదాను ఇస్తామని అంటున్నారు. ప్రత్యేక హోదాను ప్రజల్లోకి మరోసారి తీసుకెళ్లేందుకు షర్మిల బహిరంగ సభల్లో చెప్పడమే కాకుండా ఇప్పుడు ఏకంగా ఢిల్లీ వేదికగా పోరాటాలు చేయనున్నారు. ఫిబ్రవరి 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయనున్నారు. పదేళ్ల క్రితం ప్రత్యేక హోదా పదేళ్లు ఇస్తామని చెప్పిన బీజేపీ మాట తప్పిందని ఇది నమ్మక ద్రోహం అని నిరసన చేపట్టనున్నారు. దీనికి కాంగ్రెస్ అధినాయకత్వం నుంచి సీనియర్ లీడర్లు రానున్నారు. ప్రస్తుతం న్యాయ్ యాత్ర చేస్తున్న రాహుల్ గాంధీ కూడా ఈ ధర్నాలో పాల్గొంటారని చెబుతున్నారు.

## నేటినుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**(మొదటిపేజీ తరువాయి..)**

తర్వాత బడ్జెట్ ప్రతిపాదించిన మహిళా నేతగా నిర్మలా సీతారామన్ నిలిచారు. 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. అరుణ్ జైట్లీ కేంద్ర ఆర్థిక మంత్రిగా పనిచేశారు. 2014-15, 2015-16, 2016-2017, 2017-2018, 2018-2019 ఐదుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. జైట్లీ అనారోగ్యానికి గురికావడంతో 2019-2020 మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం పీయూష్ గోయల్‌కు వచ్చింది. 2019లో మోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చింది. జైట్లీ సూచనలతో నిర్మలా సీతారామన్‌కు ప్రధాని మోదీ ఆర్థిక శాఖ బాధ్యతలను ఇచ్చినట్టు తెలుస్తోంది. అలా వరసగాబడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం వచ్చింది. రెండో అత్యధిక బడ్జెట్ ప్రవేశపెట్టిన నేతగా రికార్డు సృష్టించారు. తన బ్జడెట్‌లో సంస్కరణలకే నిర్మలా సీతారామన్ ప్రాధాన్యం ఇచ్చారు. సూట్ కేసులా కాకుండా రాజముద్ర ఉన్న ఎరుపు రంగు వస్త్రంలో బడ్జెట్ ప్రతులను తీసుకొచ్చే సంప్రదాయానికి నిర్మలా సీతారామన్ శ్రీకారం చుట్టారు.ఓట్ ఆన్ అకౌంట్ బ్జడెట్‌లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని 50 శాతం పెంచే అవకాశం ఉంది. కిసాన్ సన్మాన్ పథకం ద్వారా భూమి ఉన్న రైతులకు ఏడాదికి రూ.6 వేల పంట సాయాని మూడు విడతలుగా అందిస్తున్నారు. ఇప్పుడు దానిని రూ.9 వేలకు పెంచే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వంపై రూ.12 వేల కోట్ల భారం పడనుంది. ప్రస్తుత సమావేశాల్లో 19 బిల్లులు ఆమోదించే అవకాశం ఉంది. ఇన్‌కమ్ ట్యాక్స్ తదితర విషయాల్లో పాతపద్ధతినే అవలంబించే ఛాన్స్ ఉంది.

## ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ దిగజారుతుంది



**● అరవింద్ కేజ్రీవాల్**

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ:** ఛండీఘఢ్ మేయర్ ఎన్నికల్లో ఓటమి అనంతరం కాషాయ పార్టీ లక్ష్యంగా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఆప్ సీనియర్ నేత రాఘవ్ చద్దా తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీని దేశ ద్రోహ, నిజాయితీ లేని పార్టీగా అభివర్ణించారు. చండీఘడ్ మేయర్ ఎన్నికల్లో పట్టపగలే బీజేపీ అనైతికంగా వ్యవహరించిన తీరు గర్హనీయమని, మేయర్ ఎన్నికల్లో దిగజారిన కాషాయ నేతలు ఇక లోక్‌సభ ఎన్నికల్లో ఎంతకైనా తెగిస్తారని కేజ్రీవాల్ అన్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం బీజేపీ వ్యవహరిస్తున్న తీరు విచారకరమని కేజ్రీవాల్ ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఛండీఘఢ్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 36 స్థానాలకు గాను బీజేపీ మేయర్ అభ్యర్ధి మనోజ్ సోంకర్ 16 ఓట్లతో విజయం సాధించారు. కాంగ్రెస్ సభ్యులు 8 మంది ఓట్లతో కలిపి ఆప్ మేయర్ అభ్యర్ధికి 20 ఓట్లు రావాల్సి ఉండగా 8 ఓట్లు చెల్లుబాటు కావని ప్రకటించారు. దీంతో ఆప్ మేయర్ అభ్యర్ధికి కేవలం 12 ఓట్లు పోలయ్యాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇండియా కూటమి, బీజేపీకి మధ్య జరిగిన తొలి ముఖాముఖి పోరులో బీజేపీ అభ్యర్ధి విజయం సాధించడంతో విపక్ష కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

# త్వరలోనే సీట్ల సర్దుబాటు

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి,జనవరి30:** జనసేన, టిడిపిల మధ్య సీట్ల సర్దుబాటు త్వరలోనే సర్దుబాటు కానుందని తెలుస్తోంది. అలాగే రెండు పార్టీల అధినేతలు ఉమ్మడి ప్రచారానికి సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. వచ్చే నెల 4 నుంచి మిగిలిపోయిన పార్లమెంట్ నియోజకవర్గాల్లో రా కదలిరా సభలు పెట్టనున్నారు. ఫిబ్రవరి 4న అనకాపల్లి నుంచి పవన్ కల్యాణ్ పర్యటనలు ప్రారంభించే అవకాశం ఉంది. ఉమ్మడిగా రాష్ట్రస్థాయి సభల్ని నిర్వహించాలని పవన్, చంద్రబాబు భావిస్తున్నారు. వీటిపైన ఫిబ్రవరి మొదటి వారంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఏపీలో టీడీపీ, జనసేన మధ్య సీట్ల సర్దుబాటు త్వరలో చివరిదశకు చేరుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే రెండు పార్టీల మధ్య పలుమార్లు చర్చలు జరిగాయి. చంద్రబాబు, పవన్ కూడా రెండుసార్లు సమావేశం అయ్యారు. ఎవరు ఎన్ని సీట్లలో పోటీ చేయాలి.. ఏయే సీట్లలో పోటీ చేయాలన్న అంశంపై ఇప్పటికే ప్రాథమికంగా వారు ఓ అవగాహనకు వచ్చినట్లగా తెలుస్తోంది. ఫిబ్రవరిలోనే ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నందున మొదటి వారంలో సీట్ల సర్దుబాటు ప్రకటన చేస్తే.. తర్వాత అసంతృప్తుల్ని బుజ్జగించవచ్చని అనుకుంటున్నారు. ఎన్నికల సమయానికి కూటమి స్మూత్ గా పోలింగ్ కు వెళ్లేలా ఏర్పాట్లు చేసుకోవాలని అనుకుంటున్నారు. పవన్ కల్యాణ్ ఇటీవల రెండు సీట్లు తమ పార్టీ తరపునపోటీ చేస్తున్నామని ప్రకటించారు. అందులో ఒకటి రాజోలు, రెండోది రాజా నగరం. అంతకు ముందు చంద్రబాబునాయుడు ప్రచార సభల్లో మండపేట, అరకులనుంచి అభ్యర్థుల్ని ప్రకటించారు. ఇది జనసేన పార్టీలో భిన్నాభిప్రాయాలకు కారణం అయింది. పొత్తులో ఉండి ఇలా ఏకపక్షంగా సీట్లు కేటాయించుకుని అభ్యర్థుల్ని ప్రకటించుకోవడం ఏమిటని పార్టీ క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో పవన్ సర్ది చెప్పారు. తాను కూడా రెండు సీట్లకు అభ్యర్థుల్ని ప్రకటించారు. తర్వాత నాగేంద్ర బాబు చర్య, ప్రతి చర్య అంటూ పోస్టింగ్ పెట్టడం కూడా వివాదాస్పదమయింది. చివరికి అవి పెరగకుండా చూసుకోవా లని రెండు పార్టీల నేతలు ఓ అభిప్రాయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. నిజానికి టీడీపీ, జనసేన ఎవరెవరు ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలన్న అంశంపై ఇప్పటికే ఓ అవగాహనకు వచ్చాయని.. అంతర్గతంగా ఏ ఏ సీట్లు అన్నది కూడా ఖరారు చేసుకున్నారని అంటున్నారు. అభ్యర్థుల అంశంపైనా ఓ అంచనాకు వచ్చారని చెబుతున్నారు. అయితే బీజేపీతో జనసేన పార్టీ చర్చలు జరుపుతోంది. తాము, జనసేన పార్టీ పొత్తులో ఉన్నామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇలాంటి సమయంలో అధికారికంగా పొత్తుల ప్రకటన చేయడంలో ఆలస్యం అవుతుంది. పవన్ కల్యాణ్ ఢిల్లీ వెళ్లే అవకాశం ఉందని.. ప్రచారం జరుగుతోంది. వెళ్లినా వెల్లకపోయినా.. ఫిబ్రవరి మొదటి వారంలో పొత్తుల ప్రకటన, సీట్ల సర్దుబాటు అంశాలపై రెండు పార్టీలు ఓ ప్రకటనచేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. చంద్రబాబు, పవన్ మరోసారి సీట్ల అంశంపై చర్చించేందుకు భేటీ కానున్నారు.

# కేటీఆర్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న రాజకీయాలు

**● సొంత ఇలాఖాలోనే నేతల తిరుగుబాటు**

**● పార్టీ కట్టుదాటుతున్న కిందిస్థాయి నేతలు**

**● పూర్తిగా దెబ్బతీయాలన్న ప్రయత్నాల్లో కాంగ్రెస్**



**నేటి ఫోకస్ న్యూస్, కరీంనగర్,జనవరి30:** తాజా రాజకీయ పరిణామాలతో కేటీఆర్ ఉక్కిరి బిక్కిరవుతున్నారని తెలుస్తోంది. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు రాజీనామాల బాట పడుతుండడంతో కేటీఆర్ కలవరం చెందుతున్నారు. పార్టీ నేతలను కాపాడుకోలేక ఆయన తంటాలు పడుతున్నారని చర్చ నడుస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటి అధికారాన్ని హస్తగతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలపై పూర్తి స్థాయిలో ఫోకస్ చేసింది. వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఇందుకోసం వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో జిల్లాల్లో మెల్లగా మున్సిపాలిటీలు హస్తగతం అవుతున్నాయి. జిల్లాల్లో మెల్లగా సర్పంచ్‌లు, జడ్పీటిసిలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకున్న కెటిఆర్‌ను క్షేత్రస్థాయిలో దెబ్బకొట్టాలని కాంగ్రెస్ యోచిస్తోంది. పట్టు పెంచుకోవడం లో భాగంగా బీఆర్ఎస్‌ను బలహీనం చేయడంపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తోందని తెలుస్తోంది. బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీ వేసినట్టుగా తెలుస్తోంది. ప్రణాళికలో భాగంగా సిరిసిల్లపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ ప్రయత్నాలలో భాగంగా ఇప్పటికే ముస్తాబాద్ జెడ్పీటీసీ, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు రాజీనామాలు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ఇప్పటికే దాదాపు 40 మున్సిపాలిటీల్లో అవిశ్వాసానికి కాంగ్రెస్ రంగం సిద్ధం చేసినట్టుగా తెలుస్తోంది. కేటీఆర్ విప్‌ను సైతం కౌన్సిలర్లు బేఖాతర్ చేస్తున్నారు. సొంత నియోజకవర్గంలో నేతల తిరుబాటుతో కేటీఆర్‌కు తలనొప్పిగా మారింది. నియోజకవర్గ సమావేశంలో కేటీఆర్ పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశనర చేసి 24 గంటలు కూడా గడవక ముందే ముస్తాబాద్ జెడ్పీటీసీ గుండం నర్సయ్యతో పాటు పలువురు సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, పలువురు ముఖ్యనేతలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. వీరంతా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ పరిణామం కేటీఆర్‌కు తలనొప్పిగా మారినట్టు పొలిటికల్స్ సర్కిల్స్‌లో చర్చ నడుస్తోంది. కేటీఆర్‌ను అష్టదిగ్బంధనం చేసి ఊపిరి సలపకుండా చేసే ఎత్తుగడలు, వ్యూహాలకు కాంగ్రెస్ పార్టీ తెరలేపింది. ఈ మేరకు ప్రణాళికలకు హస్తం పార్టీ పదును పెట్టినట్టుగా తెలుస్తోంది. దీంతో కేటీఆర్ చుట్టూ రాజకీయం హాట్‌హాట్‌గా మారింది. ఆపరేషన్ ఆకర్ష్‌ను మొదలుపెట్టినట్టుగా పరిణామాల చూస్తే అర్థమవుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో ఆకర్షితులవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

## తొలి ఎన్నికల్లోనే ఇండియా కూటమి ఓడిపోయింది..

**● జేపీ నడ్డా కీలక ట్వీట్..**



**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ:** విపక్ష ఇండియా కూటమికి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఇండియా కూటమి పోటీ చేసిన తొలి ఎన్నికల్లో ఓటమి పాలయ్యింది. చండీఘఢ్ మేయర్ ఎన్నికల్లో విపక్ష కూటమిపై బీజేపీ ఘన విజయం సాధించింది. బీజేపీ అభ్యర్థి మనోజ్ కుమార్ సోంకర్ ఆప్-కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి కుల్దీప్ సింగ్‌పై విజయం సాధించారు. ఎక్స్‌అఫిషియో సభ్యుడు కిరణ్ ఖేర్ ఓటుతో సహా మనోజ్ సోంకర్‌కు 16 ఓట్లు వచ్చాయి. 35 మంది సభ్యులు కలిగిన చండీఘఢ్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీ 16 స్థానాలను గెలుపొందింది. ఈ ఎన్నికలో బీజేపీకి 16 ఓట్లు రాగా, ఇండియా కూటమికి 12 ఓట్లు వచ్చాయి. 8 ఓట్లు రద్దయ్యాయి. రద్దయిన ఓట్లు ఇండియా అలయన్స్ పార్టీలైన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందినవి. భారత కూటమికి 20 మంది బలం ఉండగా, వారికి కేవలం 12 ఓట్లు వచ్చాయి. 8 ఓట్లు రద్దవ్వడం సంచలనంగా మారింది. కౌంటింగ్ సమయంలో ప్రిసైడింగ్ అధికారి ఏజెంట్‌ను ముందుకు రానివ్వలేదని, ఈ సందర్భంగా ఆయన పెన్నుతో కొన్ని మార్కింగ్‌లు చేశారని, ఆ తర్వాత ఓట్లను రద్దు చేశారని ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్‌లు ఆరోపిస్తున్నాయి. బీజేపీని ఓడించాలన్న లక్ష్యంతో ఆప్-కాంగ్రెస్ కూటమి చెమటోడ్చినా విపక్ష కూటమికి చుక్కెదురైంది.

**వారి స్ట్రాటజీ పనిచేయలేదు.. జేపీ నడ్డా..**

చండీఘఢ్ మేయర్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కీలక ట్వీట్ చేశారు. చండీగఢ్ లో బీజేపీ విజయం సాధించడం పట్ల అభినందనలు తెలిపారు. మేయర్ ఎన్నికల్లో గెలుపు కోసం యూనిట్ తీవ్రంగా కృషి చేసిందన్నారు. ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలో యూటీలు రికార్డు స్థాయిలో అభివృద్ధిని సాధించాయన్నారు. ఇండియా అలయన్స్ మొదటి ఎన్నికల యుద్ధంలో పోరాడి.. %దీజీూ% చేతిలో ఓడిపోయిందంటూ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో వారి స్ట్రాటజీ.. భాగస్వామ్య అంచనా పని చేయలేదని పేర్కొన్నారు.

# ఏసీబీ కస్టడీకి శివబాలకృష్ణ

**● 8రోజులు అనుమతిస్తూ నాంపల్లి కోర్టు ఆదేశాలు**


**● అనుమతులు, ఆస్తులపై లోతైన విచారణ**



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి30:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన హెచ్ఎండిఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణను 8 రోజుల కస్టడీకి ఏసీబీకి అనుమతి ఇస్తూ మంగళవారం నాంపల్లి ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎనిమిది రోజుల పాటు బాలకృష్ణను ఏసీబీ అధికారులు విచారించనున్నారు. విచారణ సందర్భంగా బ్యాంక్ లాకర్లు ఓపెన్ చేయనున్నారు. శివ బాలక్రిష్ణ మోసాలపై ఏసీబీ అధికారులు విచారణ చేయనున్నారు. శివ బాలకృష్ణ పని చేసిన సమయంలో ప్రాజెక్ట్ ఫైల్స్ అన్ని పరిశీలించాలని ఏసీబీ నిర్ణయించింది. ఈ మేరకు హెచ్ఎండిఏ నుంచి ఫైల్స్‌ను తెప్పించుకుని విచారణ చేయనున్నారు. 10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై మంగళవారం విచారణ జరిపిన నాంపల్లి ఏసీబీ కోర్టు 8 రోజుల కస్టడీకి అనుమతిచ్చింది. వివిధ మీడియాల్లో వచ్చిన కథనంపై అధికారులు విచారణ వేగవంతం చేయనున్నారు. పుప్పాలగూడలో రూ. వేయి కోట్లు ప్రాజెక్టు అనుమతులపై అవకతవకలు జరిగాయని.. దానికి సంబంధించిన ఫైల్స్ హెచ్ఎండిఏ ఇవ్వాలని కోరుతూ సంబంధిత అధికారులకు ఏసీబీ లేఖ రాసింది. హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్.. ప్రస్తుత రెరా సెక్రటరీ శివబాలకృష్ణ, ఆయన బంధువుల ఇళ్లు, కార్యాలయాలలో ఏసీబీ ఆధికారులు ఐదు రోజుల క్రితం సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో.. ఎనిమిది బృందాలుగా విడిపోయిన ఏసీబీ అధికారులు బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుంచే రాష్ట్రవ్యాప్తంగా 17 చోట్ల సోదాలు చేశారు. మణికొండలోని ఆయన నివాస గృహంలో, అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయంలో కూడా తనిఖీలు చేశారు. 2018-2023 కాలంలో హెచ్ఎండీఏ ఎ÷-లానింగ్ విభాగంలో కీలక స్థానంలో పనిచేసిన శివబాలకృష్ణ.. అధికార దుర్వినియోగానికి పాల్పడడం ద్వారా కోట్లాది రూపాయల ఆస్తులు అక్రమంగా కూడబెట్టినట్టు వచ్చిన ఆరోపణలు, వాటిపై తాజా ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో మణికొండలోని ఆయన ఇంటిలో సోదాలు నిర్వహించి, పదికి పైగా ఐఫోన్లు.. అత్యంత ఖరీదైన 50 వాచీలు.. కట్టలు కట్టలుగా నగదు.. ఆయన బీరువాలో 5 కిలోల బంగారు నగలు, 70 ఎకరాలకు సంబంధించిన భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

## రాజ్యసభకు సత్నామ్ సింగ్ సంధు..

**నామినేట్ చేసిన రాష్ట్రపతి ముర్ము**



**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ:** ఛండీఘడ్ యూనివర్శిటీ ఛాన్సలర్ సత్నామ్ సింగ్ సంధును రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్రపతి నామినేట్ చేశారు. సత్నామ్ సింగ్‌ను రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేయడాన్ని స్వాగతిస్తున్నట్టుగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు. సంధును రాజ్యసభకు నామినేట్ చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. సత్నామ్ సింగ్ ప్రఖ్యాత విద్యావేత్త, సామాజిక సేవకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అతను అట్టడుగు స్థాయి ప్రజలకు వివిధ మార్గాల్లో సేవ మార్గంలో ఉన్నారు. సత్నామ్ సింగ్ ఎప్పుడూ జాతీయ ఐక్యతను పెంపొందించారని, ఎన్నారైలతో కలిసి పని చేశారని ప్రధాని మోదీ అన్నారు. ఆయన రాజ్యసభకు నామినేట్ కావడం తాను శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. అలాగే రాజ్యసభ కార్యకలాపాలు ఆయన అభిప్రాయాలతో సుసంపన్నం అవుతాయని విశ్వసిస్తున్నానని మోదీ అన్నారు.

**ఫిబ్రవరి 1 నుండి కొత్త ఐఎంపీఎస్ రూల్..**

సత్నామ్ సింగ్ సంధు 2001లో మొహాలిలోని లాండ్రాన్‌లో చండీగఢ్ గ్రూప్ ఆఫ్ కాలేజెస్‌కి పునాది వేశారు. దీని తరువాత 2012 సంవత్సరంలో అతను చండీగఢ్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు చూశాడు. కానీ చండీగఢ్ యూనివర్శిటీ ఛాన్సలర్ సంధూ లక్షలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఆర్థిక సహాయం చేస్తున్నారు.

అతను తన రెండు ఎన్జీఓలు 'ఇండియన్ మైనారిటీస్ ఫౌండేషన్', న్యూ ఇండియా డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ద్వారా ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరచడానికి, అలాగే మత సామరస్యాన్ని పెంపొందించడానికి పెద్ద ఎత్తున కమ్యూనిటీ ప్రయత్నాలలో చురుకుగా పాల్గొంటారు. అతను దేశీయంగా జాతీయ సమైక్యత కోసం తన ప్రయత్నాలతో ఒక ముద్ర వేశారు. విదేశాలలో ఉన్న భారతీయ ప్రవాసులతో విస్తృతంగా పనిచేశారు. లక్షలాది మంది విద్యార్థులు చదువుకునేందుకు సంధు పరోక్షంగా, ప్రత్యక్షంగా కారణమయ్యారు. రెండు ఎన్ జి ఓ సంస్థలను ఏర్పాటు చేశారు. ఈ రెండు సంస్థల ద్వారా ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాదు మతసామరస్యం పెంపొందించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాతీయ సమైక్యత కోసం సంధు పలు కార్యక్రమాలను నిర్వహించారు. విదేశాల్లోని ప్రవాసులతో కూడ కలిసి పనిచేశాడు. సత్నామ్ సంధును రాజ్యసభకు రాష్ట్రపతి నామినేట్ చేయడంపై ప్రధాని నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు.ప్రముఖ విద్యావేత్తగా , సామాజిక కార్యకర్తగా సంధు పేరొందిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.జాతీయ సమైఖ్యత కోసం సంధు నిరంతరం పనిచేసిన విషయాన్ని మోడీ ప్రస్తావించారు.

## వనపర్తిలో ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు



**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) :** వనపర్తి జిల్లా కేంద్రంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు మంగళవారం వేర్వేరు చోట్ల ఘనంగా నిర్వహించారు. గాంధీ చౌక్ లో స్థానిక కాంగ్రెస్ నాయకులు లక్కాకుల సతీష్ కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీర్ల చందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి వేడుకలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం కోసం మహాత్మా గాంధీ శాంతి మార్గాన్ని ఎంచుకొని ఆంగ్లేయులను తరిమికొట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటేష్, బ్రహ్మం చారి, జయసుధ మధు గౌడ్, సుమిత్ర యాదగిరి, విభూది నారాయణ, లక్ష్మీ రవి యాదవ్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ల తీర్మానమే శిరోధార్యం

- కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి
- రోడ్డు విస్తరణ పనులు యధావిధిగా కొనసాగుతాయి
- మునిసిపల్ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డి




**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) జి. శ్రీనివాస యాదవ్ జనవరి 31:** మున్సిపల్ కౌన్సిల్ లో కౌన్సిలర్లు చేసే తీర్మానమే శిరోధార్యమని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో 2024- 25కు సంబంధించిన బడ్జెట్ సమావేశానికి ఆయనతో పాటు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ (లోకల్ బాడీస్)లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో ఎన్నుకోబడిన కౌన్సిలర్లు తీర్మానించిన ప్రతి సమస్యపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. మునిసిపాలిటీకి అత్యధికంగా ఆదాయాన్ని ఇచ్చే ఇంటి పన్నులపై అధికారులు దృష్టి సారించి అధిక ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. బడ్జెట్ సమావేశం ఉండి కూడా కొందరు అధికారులు విధులకు దుమ్మా కొట్టడంతో ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరైన వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డిని ఆదేశించారు. రోడ్లు ఊడ్చే స్వీపింగ్ మిషన్ కొన్న సమయంలో వారంటీని చూసుకోకుండా ఎలా కొనుగోలు చేస్తారని మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంటీని పరిశీలించి సంబంధిత కంపెనీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. రోడ్ల విస్తరణలో 10 కోట్ల పై చిలుకు పెండింగ్ పనులు ఉన్నాయని వాటిని కొనసాగించేందుకు ఇటీవల జిల్లా కలెక్టర్ తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో మొదలైన పనులను యధావిధిగా కొనసాగిస్తామని అందుకు అధికారులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యం కోసం అమరులైన త్యాగధనులను స్మరించుకోవాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) జి. శ్రీనివాస యాదవ్ జగత్‌పల్లి జనవరి 30:** స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన అమరుల ఆశయాల సాధన దిశగా పౌరులంతా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం షహీద్ దివస్ సందర్భంగా స్వాతంత్ర్య కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజావాణి హాల్లో అధికారులంతా రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశం కోసం, స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవడమే కాకుండా వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అమరుల త్యాగాలు ఎంతో గొప్పవని, వారి ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి ప్రతి పౌరుడు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, (లోకల్ బాడీస్)ఎస్. తిరుపతి రావు (రెవెన్యూ)ఇతర అన్ని జిల్లా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) జి. శ్రీనివాస యాదవ్ జగత్‌పల్లి జనవరి 30:** జాతిపిత మహాత్మా గాంధీ ఆశయం మేరకు దేశాన్ని కుష్టు వ్యాధి రహితంగా తీర్చి దిద్దాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. మంగళవారం కుష్టు వ్యాధి నివారణ దినోత్సవ(నేషనల్ యాంటీ లెప్రసీ డే ) సందర్భంగా కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీ ఆశయం మేరకు దేశాన్ని కుష్టు వ్యాధి రహితంగా తీర్చి దిద్దాలన్నారు. కుష్టు వ్యాధి గ్రస్థుల పట్ల వివక్ష చూపకూడదన్నారు. ఈ సందర్భంగా అధికారులంతా కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేసారు. కుష్టు వ్యాధి గురించి అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా, పలువురు కుష్టు వ్యాధితో బాధ పడుతున్న వారికీ పోషకాహార కిట్లను కలెక్టర్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, తిరుపతి రావు, డీ ఎం హెచ్ వో జయచంద్ర, డాక్టర్ సాయినాథ్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇతర అన్ని జిల్లా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాండ్ పేపర్స్ వెండర్స్‌పై చర్యలు తీసుకోవాలి

- షేక్ బిక్కన్

**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) జి శ్రీనివాస యాదవ్ జనవరి 31:** వనపర్తిలో బాండ్ పేపర్స్, కోర్టు ఫీ స్టాంపులు అధిక ధరలకు విక్రయించే వెండర్స్ పై చర్యలు తీసుకోవాలని వనపర్తికి చెందిన సీనియర్ సిటిజన్ షేక్ బిక్కన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. లైసెన్సులు పొందిన చోట బాండ్ పేపర్లు విక్రయించకుండా రియల్ ఎస్టేట్ కార్యాలయాలు, నోటరీ ఆఫీసులు ఉండే చోట అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫోన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపుల సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కోర్టు ఫ్రీ స్టాంపులు, బాండ్ పేపర్లు విక్రయించే లైసెన్స్ దారుల షాపుల దగ్గర సీసీ కెమెరాలు అమర్చాలని తెలంగాణ హైకోర్టు, హ్యూమన్ రైట్స్ కమిషన్, లోకాయుక్త, ఇన్స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్, ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు పంపినట్లు ఆయన తెలిపారు.



## బాధిత కుటుంబాలకు రెడ్ క్రాస్ చేయూత



**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) జి. శ్రీనివాస యాదవ్ జగత్ పల్లి జనవరి 31:** వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం బుద్దారం గ్రామ నివాసి గొల్ల పరమేష్ పెంకుటిల్లు శిధిలావస్థలో ఉండి ఆర్థిక పరిస్తితి బాగలేని కారణంగా బాధిత కుటుంబానికి చేయూత అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవార్ ఆదేశించడంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వనపర్తి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు వంట సామాగ్రి, పైకప్పుకు టార్పాలిన్ కవర్ అందజేయడం జరిగిందని రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ సయ్యద్ కలాం భాష ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వనపర్తి పట్టణంలో షార్ట్ సర్క్యూట్ వల్ల జీవనోపాధి అందించే షాప్ కాలిపోవడం చేత గృహోపకరణాలు నష్టపోయిన కుటుంబ బాధితులకు రెడ్ క్రాస్ సహాయ సామగ్రి, హైజెనిక్ కిట్ మొదలగునవి అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ సయ్యద్ కలామ్ పాష మాట్లాడుతూ విపత్కర పరిస్తితులలో నష్టపోయిన బాధితులకు అండగా రెడ్ క్రాస్ సొసైటీ ఎప్పుడు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గోనురు యాదగిరి, జిల్లా కోఆర్డినేటర్ ఆర్. రాజేందర్ కుమార్, వాలంటీర్ ఎం. డి. పాష తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

# గాంధీ వర్ధంతి వేడుకలు



**తొర్రూర్(నేటి ఫోకస్ న్యూస్)జనవరి30:** స్వర్గీయ మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని తొర్రూర్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ ల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి 76వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ సత్యం అహింస మార్గాల్లో బ్రిటిష్ వారి బానిసత్వ పాలన నుంచి విముక్తులను చేసి భారతదేశానికి స్వతంత్రం తీసుకొచ్చిన మహానుభావుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు. అంతేకాకుండా1948 భారతదేశం స్వతంత్రం పొందిన 15 రోజులకే నాథూరాం వినాయక్ గాడ్సే గాంధీజీని తుపాకీతో కాల్చి చంపారని, మోహన్ దాస్ కరంచంద్ గాంధీ 1869 అక్టోబర్ 2న పోర్బందర్ లో జన్మించారని ఆయన చిన్న వయసులోనే 13వ ఏటనే పెద్దలు కస్తూర్బా అనే బాలికతో వివాహం జరిపించారని అన్నారు. అనంతరం గాంధీజీ బారిస్టర్ చదువుల కోసం లండన్ వెళ్లారని, అక్కడ న్యాయవిద్యను పూర్తి చేసుకున్న అనంతరం 1983లో సౌత్ ఆఫ్రికాలోని ఇండియన్ మర్చంట్ తరపున కేసును వాదించడానికి వెళ్ళాడని, మొదటిసారి గాంధీజీ సౌత్ ఆఫ్రికా లోని పౌర హక్కుల పోరాటంలో అహింసా మార్గంలో నడవాలని అహింస అనే ప్రధాని ఉపయోగించడం, గాంధీజీ భారత స్వతంత్రానికి తన జీవితాన్ని అంకితం అంకితం చేశాడని అంటరానితనం, పేదరికానికి వ్యతిరేకంగా పోరాడని అన్నారు. ఆ తర్వాత 1915లో తిరిగి భారత్ వచ్చిన గాంధీ బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సత్యాగ్రహం, అహింసా ఉద్యమాలను ప్రారంభించాడని, భారత స్వాతంత్ర్యనికి ముఖ్యమైన పాత్ర పోషించి మహిళా హక్కుల కోసం పోరాడిన గొప్ప న్యాయవాది మహాత్మాగాంధీ అని అన్నారు. 1948 జనవరి 30 న ఢిల్లీలోని బిర్లాభవన్ లో సాయంత్రం ఆయన తన మనవరాళు బాపు అభా మరియు మను భుజాలపై చేతులు వేసుకుని ప్రార్థన సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్నప్పుడు హిందూ జాతీయవాది అయిన నాథూరామ్ గాడ్సే గాంధీజీపై మూడు రౌండ్ల బుల్లెట్లను ప్రయోగించారని, దీంతో బాపూ ఛాతిలోకి మూడు బుల్లెట్లు తగిలి మరణించారని,అప్పటి నుంచి ఆయన వర్ధంతిని అమరవీరుల దినోత్సవంగా జరుపుకోవడం మొదలుపెట్టారని అన్నారు గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పెదగాని సోమయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు భూసాని రాము, తూనం రోజా ప్రభుదాస్, కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు బూర్గుల ప్రశాంతి, ఉపాధ్యక్షురాలు శీలం హరిత, యూత్ పట్టణ అధ్యక్షుడు బసన బోయిన మహేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు ధరావత్ సోమన్న, అనుమాండ్ల నరేందర్ రెడ్డి, తాళ్లపల్లి బిక్షం గౌడ్, దీకొండ శ్రీనివాస్ గౌడ్, నరేష్ రెడ్డి, సమ్మయ్య గౌడ్, అశోక్ రెడ్డి, శ్రీనివాస చారి,ప్రహ్లాద రావు, తూర్పాటి రాంబాబు, తాటికాయల రాణి, అనిత, అండాలు, నడిగడ్డ మధు తదితరులు పాల్గొన్నారు.

**వాసవి క్లబ్ ఆధ్వర్యంలో..**

వాసవి క్లబ్ అధ్యక్షులు విద్యాల అనిల్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గోపారపు రామా ఉపేందర్, డిస్ట్రిక్ట్ వి 101 ఏ

రీజియన్ చైర్మన్ ప్రొద్దుటూరు గౌరీ శంకర్, తొర్రూరు వాసవి క్లబ్ కార్యదర్శి చౌడవరపు రాము, కోశాధికారి వల్లపు మధు రీజియన్ పిఆర్ఓ చిదురాల రవి, యూత్ యూత్ క్లబ్ సభ్యులు, అఖిల్ నిఖిల్ లు , తొర్రూర్ మండలం గుంటూరు గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ మోత్కూరి రవీంద్ర చారి ఆధ్వర్యంలో ఎంపీటీసీ మాధవి రమేష్ ,మాజీ ఎంపీటీసీ మోత్కూరి సాహితి, ఉప సర్పంచ్ ఆవుల సుజాత, రవి కుమారులు గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు

**వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలను అభినందించిన మున్సిపల్ కమిషనర్ సరస్వతి**

గాంధీ వర్ధంతి వేడుకలను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సందర్భంగా గాంధీ వర్ధంతి పురస్కరించుకొని వారు చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో క్లబ్ సభ్యులు స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని వాసవి క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని వారన్నారు.

## ఈవీఎంలపై అవగాహన ఉండాలి

- అదనపు కలెక్టర్ సీతారామారావు

**నేటి ఫోకస్ న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి జయశంకర్ జనవరి 30:** ఓటర్లు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల(ఈవీఎం)పై అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ కే సీతారామారావు అన్నారు. ప్రజలకు ఈవీఎంత్రాలపై కలిగించడానికి ఈవీఎం యంత్రాలను ఈవీఎం గోదాముల నుండి ఈవీఎంలను తరలించే ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఓటరు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ల గురించి తెలుసుకోవడానికి అచ్చంపేట కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయాలతో పాటు నాగర్ కర్నూల్ కలెక్టరేట్లో అవగాహన కేంద్రాలను రేపటి నుంచి అందుబాటులోకి తేనున్నట్లు ఆయన తెలిపారు. ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన



కల్పించడానికి క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తామన్నారు. బుధవారం నుండి కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయంలో అవగాహన కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. అనంతరం మాక్ పోలింగ్ నిర్వహించి తాము వేసిన ఓట్లను పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జాకీర్ అలీ డిప్యూటీ తహసీల్దార్ రఘు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయా తాహసిల్దార్లు పాల్గొన్నారు

## దేశ స్వాతంత్ర్యం కోసం అమరుల త్యాగధనులను స్మరించుకోవాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్



**నేటి ఫోకస్ న్యూస్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి జయశంకర్ జనవరి 30:** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన అమరుల ఆశయాల సాధన దిశగా పౌరులంతా కృషి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం (జనవరి 30) షహీద్ దివస్ సందర్భంగా స్వాతంత్ర్య కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నాగర్ కర్నూల్ ఐడిఓసి కలెక్టరేట్ కార్యాలయా ప్రజావాణి హాల్లో జిల్లా స్థాయి అధికారులు సిబ్బంది 2 నిముషాలు మౌనం పాటించి దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించి అమరులైన వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ స్వతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవడమే కాకుండా వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారి త్యాగంతోనే నేడు స్వేచ్ఛాయుత దేశంలో జీవిస్తున్నామని అన్నారు. అమరుల త్యాగాలు ఎంతో గొప్పవని, వారి ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని అభివృద్ధి పథం లో తీసుకెళ్లడానికి ప్రతి పౌరుడు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ కే సీతారామారావు, జిల్లా అధికారులు నర్సింగ్ రావు, సీతారాం, పత్యా నాయక్, శ్రీనివాస్ బాబు, కమలాకర్ రెడ్డి, కలెక్టరేట్ సూపరిండెంట్లు జాకీర్ అలీ, కార్తీక్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల అభివృద్ధికి గ్రామపంచాయతీలే పట్టుకొమ్మలు


- గ్రామపంచాయతీ నూతన భవనాల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్):** అభివృద్ధి పథంలో గ్రామపంచాయతీలే పట్టుకొమ్మలుగా నిలుస్తాయని గ్రామపంచాయతీలు అన్ని రంగాలుగా అభివృద్ధి చెందినాడే ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీల నూతన భవనాల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గోపాల్పేట మండలం బుద్ధారం గ్రామ పాటిగడ్డ తాండ, పోలికే పహాడ్ గ్రామ ఆముదాల కుంట తండా, రేవల్లి మండలం గొల్లపల్లి గ్రామ నూతన పంచాయతీ కార్యాలయాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలో ఉండే సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు సమన్వయంతో పని చేస్తే గ్రామం త్వరితగతిన అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో పార్టీలకతీతంగా అందరూ కలిసి పని చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎలాంటి సమస్యలున్న నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో పాటిగడ్డ తాండ సర్పంచ్ శంకర్ నాయక్ ఉపసర్పంచ్ రాజేందర్ శాంతాబాయి పంచాయతీ కార్యదర్శి రమేష్, ఆముదాల కుంట తండా సర్పంచ్ శంకర్ ఉప సర్పంచ్ అంజమ్మ, మాజీ సర్పంచ్ సత్య శీలారెడ్డి, గొల్లపల్లి గ్రామ సర్పంచ్ సునీల్ కుమార్ ఉపసర్పంచ్ లక్ష్మి ఎంపిటిసి సేనపతి మండల జడ్పిటిసి సభ్యురాలు మంద భార్గవి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు పర్వతాలు రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్వతాలు పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా పుష్ప చిత్రీకరణ

పుష్ప చిత్రం దేశవ్యాప్తంగా ఎంత సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా పుష్ప-2 సినిమా తెరకెక్కుతోంది. తొలి భాగం సాధించిన విజయంతో సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో మేకర్స్, ముఖ్యంగా సుకుమార్ ఈ చిత్రాన్ని పార్ట్1ను మించేలా జాగ్రత్తగా తెరకెక్కిస్తున్నాడు. అదీ కాక ఈ చిత్రానికి అల్లు అర్జున్ కు ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారం దక్కడంతో ఎంతో బాధ్యతతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రష్మిక మందన్నా కథానాయికగా, పాహాద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోండగా దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించగా ఓ రెండు మూడ్రోజుల నుంచి పుష్ప-2 విడుదల వాయిదా అంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై బన్నీ డిజిటల్ టీమ్ వివరణ కూడా ఇచ్చింది. అనుకున్న సమయానికే పుష్పరాజ్ ర్యాంపేజ్ ఖాయం అంటూ ట్వీట్ సైతం చేశారు. తాజాగా సుకుమార్ టీమ్ మరోసారి ఈ చిత్రం విడుదల తేదీ విషయంలో స్పష్టతనిచ్చింది. ఇంకా 200 రోజుల్లో పుష్పరాజ్ రూల్స్ ప్రారంభం కానున్నాయి' అని చెబుతూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో పుష్ప-2 విడుదలలో ఎలాంటి మార్పు లేదని మరోసారి క్లారిటీ ఇచ్చినట్లైంది.






## వరుస సినిమాలతో బిజీగా అనుపమ

కేరళ కుట్టి అనుపమ పరమేశ్వరన్?కు తెలుగులో ఉన్న ఫాలోయింగ్ గురించి చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంటుంది. త్వరలోనే టిల్లు స్క్వేర్ సినిమాతో రాబోతుంది ఈ బ్యూటీ. తెలుగు, తమిళ్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉంటుంది అనుపమ. ఉంగరాల కురులతో.. కలువ కళ్లతో యూత్‌ను కట్టిపడేస్తుంది. అటు సినిమాలు చేస్తూనే.. ఇటు సోషల్ మీడియాలో యాక్టివ్?గా ఉంటూ ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఫోటోస్ షేర్ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన నెట్టింట తెగ వైరలవుతున్నాయి. అటు సినిమాలు చేస్తూనే.. ఇటు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఫోటోస్ షేర్ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన నెట్టింట తెగ వైరలవుతున్నాయి. పట్టు చీరలో.. జడలో మ్లలెపూలు.. మెడలో తాళి చూపిస్తూ కొన్ని ఫోటోస్ షేర్ చేసింది ఈ కేరళ కుట్టి. దీంతో అనుపమ ఫోటోస్ పై ఫన్నీగా కామెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్.

## బూట్ కట్ బాలరాజుగా సోహైల్



బిగ్ బాస్ రియాలిటీ షోతో గుర్తింపు తెచ్చుకున్న సయ్యద్ సోహైల్, 'బూట్ కట్ బాలరాజు' అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకు రాబోతున్నారు. కోనేటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఫిబ్రవరి 2న ఈ సినిమా విడుదలకు రెడీ అవుతోంది. ఇప్పటికే ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్లు, టీజర్, ప్రమోషనల్ వీడియోలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయి. సినిమాపై భారీగా అంచనాలు పెంచాయి. తాజాగా 'బూట్ కట్ బాలరాజు' ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ వేడుకలో కామెడీ బ్రహ్మ బ్రహ్మానందం, మంచు మనోజ్, సందీప్ కిషన్, సాయి రాజేష్, లక్ష్మీ భూపాల్ సహా పలువరు సినీ సెలబ్రిటీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సోహైల్ తన సినిమా గురించి కీలక విషయాలు వెల్లడించాడు. అందరూ తమ సినిమా చూడాలంటూ ఎమోషనల్ అయ్యాడు. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడినట్లు చెప్పాడు. 'మా నాన్న రిటైర్మెంట్ డబ్బులు, నేను సంపాదించిన డబ్బులు, ఇల్లు కొనేందుకు దాచుకున్న డబ్బులు ఈ సినిమా కోసం పెట్టాను. ఈ సినిమా కోసం మా సర్వస్వం ధారపోశాం. సినిమా కోసం అందరిలాగే కష్టపడ్డాం. కొన్ని సార్లు ఏడ్చాం కూడా. నన్ను నేను నిరూపించుకోవాలి అనే కసి ఏర్పడింది' అని సోహైల్ అన్నారు. ఇక తన సినిమా గురించి పెద్ద ఎత్తున ప్రమోషన్ చేయడానికి డబ్బులు లేవని చెప్పిన సోహైల్, ప్రతి ఒక్కరు థియేటర్ కు వెళ్లి చూడాలని కోరారు. స్టేజి మీద మోకాళ్ల మీద కూర్చొని అందరికీ విజ్ఞప్తి చేశారు. 'నా సినిమాను థియేటర్ కు వెళ్లి చూడండి. సినిమా గురించి ఇంత కంటే ఎక్కువ పబ్లిసిటీ చేసుకునేందుకు డబ్బులు లేవు. ఫిబ్రవరి 2న 'బూట్ కట్ బాలరాజు' సినిమా థియేటర్లలోకి వస్తుంది. మీరంతా చూసి ఆశీర్వదించండి' అంటూ కంటతడి పెట్టుకున్నారు సోహైల్. 'బూట్ కట్ బాలరాజు' సినిమాలో సోహైల్ సరసన మేఘ లేఖ హీరోయిన్ గా నటించింది. ఎండీ పాషా ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రంలో సీనియర్ నటి ఇంద్రజ, సునీల్, సిరి హన్మంతు, జబర్దస్త్ రోహిణి, ముక్కు అవినాష్, సద్దాం కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.

## అరుంధతి లాగానే హనుమాన్ విజయం






టాలీవుడ్‌లో సంక్రాంతి అంటే సినిమా పండుగగా భావిస్తుంటారు. తెలుగు ప్రేక్షకులు థియేటర్లకు తరలి వచ్చే అతి పెద్ద సీజన్ కావడం, కంటెంట్ ఎలా ఉన్నా అంతో ఇంతో కలెక్షన్స్ వచ్చే ఛాన్స్ ఉంటుంది కాబట్టి, ప్రతి ఒక్కరూ అదే టైంలో రావాలని కోరుకుంటారు. అలాంటి మ్యాజిక్కే దాదాపు 15 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో రిపీట్ అయింది. సంక్రాంతి పోరు ఎంత రసవత్తరంగా ఉంటుంది.. అయితే కంటెంటే కింగ్ అని, కంటెంట్ బాగుంటే సినిమాను ఎవ్వరూ ఆపలేరని 2024 ఫెస్టివల్ సీజన్ మరోసారి నిరూపించింది. చిన్న సినిమాగా వచ్చిన 'హను-మాన్' బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేసింది. ప్రేక్షకుల హృదయాలను గెలుచుకొని పొంగల్ విన్నర్ గా నిలిచింది. ఈ క్రమంలో టాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన 'సంక్రాంతి సినిమా'గా సరికొత్త రికార్డ్ సృష్టించింది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తేజ సజ్జ, అమృత అయ్యర్ ప్రధాన పాత్రలతో తెరకెక్కిన పాన్ ఇండియా సూపర్ హీరో మూవీ 'హనుమాన్'. ఈ సంక్రాంతికి సూపర్ స్టార్ మహేష్ బాబు, కింగ్ అక్కినేని నాగార్జున, విక్టరీ వెంకటేష్ లాంటి స్టార్ హీరోల సినిమాలతో పాటుగా రిలీజైంది. తొలి రోజు నుంచే వాటికి గట్టి పోటీ ఇవ్వటమే కాదు, బాక్సాఫీస్ దగ్గర కంప్లీట్ డామినేషన్ చూపించింది. తెలుగులో రాష్ట్రాల్లోనే కాదు, విడుదలైన అన్ని ప్రాంతాల్లోనూ అనూహ్యమైన వసూళ్లు సాధించింది. హనుమాన్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ. 270 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టినట్టు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. తెలుగులో అల్లు అర్జున్ 'అల వైకుంఠపురములో' ఇప్పటి వరకు అత్యధిక వసూళ్లు సాధించిన సంక్రాంతి చిత్రంగా ఉండగా, ఇప్పుడు హనుమాన్ సినిమా దాన్ని బీట్ చేసి టాప్ లో నిలిచింది. ఇక నార్త్ అమెరికాలో 5 మిలియన్ డాలర్లకుపైగా కలెక్షన్స్ తో దూసుకుపోతోంది. ఇప్పుడు 'హనుమాన్' మాదిరిగానే సరిగ్గా 15 ఏళ్ళ క్రితం 'అరుంధతి' సినిమా కూడా సంచలన విజయం సాధించింది. అనుష్క ప్రధాన పాత్రలో కోడి రామకృష్ణ దర్శకత్వంలో ఈ హారర్ ఫాంటసీ మూవీ తెరకెక్కింది. 2009 సంక్రాంతి కానుకగా జనవరి 16న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఎలాంటి అంచనాలు లేకుండా థియేటర్లలోకి వచ్చిన ఈ విమెన్ సెంట్రిక్ సినిమా.. స్టార్ హీరోల సినిమాల రేంజ్ లో హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో నడిచింది. రూ. 13 కోట్ల బ్జడెట్ తో తీస్తే, రూ. 70 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. ప్రస్తుతం అందరూ 'హనుమాన్' గురించి ఎలా మాట్లాడుకున్నారో, అప్పుడు 'అరుంధతి' గురించి కూడా అలానే మాట్లాడుకున్నారు. ఈ చిత్రం పది నంది అవార్డులు, రెండు ఫిలింఫేర్ సౌత్ అవార్డులతో సహా అనేక అవార్డులు రివార్డులు అందుకుంది.

## తిరుపతిలో సందడి చేసిన ధనుష్, నాగార్జున..

### కపిల తీర్థం నంది సర్కిల్‌లో షూటింగ్



నాగార్జున ధనుష్‌తో కలిసి నటిస్తున్నారు. టాలీవుడ్ సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ధనుష్ తో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో నాగార్జున కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీ షూటింగ్ తిరుపతిలో జరుగుతోంది. తిరుపతిలోని కపిల తీర్థం నంది సర్కిల్‌లో ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో సీన్స్ ను తెరకెక్కిస్తున్నారు. నాగార్జున ఇటీవలే నాసామిరంగ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. సంక్రాంతికానుకగా వచ్చిన ఈ సినిమా మంచి కలెక్షన్స్ ను సాధించింది. ఇక ఇప్పుడు నాగార్జున ధనుష్ తో కలిసి నటిస్తున్నారు. టాలీవుడ్ సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ధనుష్ తో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో నాగార్జున కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీ షూటింగ్ తిరుపతిలో జరుగుతోంది. తిరుపతిలోని కపిల తీర్థం నంది సర్కిల్‌లో ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో సీన్స్ ను తెరకెక్కిస్తున్నారు. దాంతో ఉదయం నుంచే తిరుమలకు వెళ్లే వాహనాలను పోలీసులు దారి మళ్లించారు. దాంతో విద్యార్థులు, ఉద్యోగులతో పాటు భక్తులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు భక్తులు దీని పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ.. అన్ని అనుమతులు తీసుకొనే షూటింగ్ చేస్తున్నామని మూవీ యూనిట్ చెప్తోంది.